క్లుప్తంగా

నేడు ఎమ్మెల్యే పర్యటన

ఎటపాక: మండలంలో ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి శుక్రవారం పర్యటించనున్నారు. మధ్యాహ్నం 2 గంటలకు మండల పరిషత్ కార్యాలయం సమావేశ మందిరంలో వలంటీర్లకు సన్మాన కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొంటారని పార్టీ వర్గాలు తెలిపాయి.గుండాల గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం జరుగుతుందని, పార్టీ శ్రేణులు తరలిరావాలని కోరారు.

మండల సమావేశం నేడు

దేవీపట్నం: మండల పరిషత్ సర్వసభ్య సమావేశం శుక్రవారం నిర్వహిస్తున్నట్టు ఎంపీడీవో డి.ఎస్.రత్నకుమారి తెలిపారు. ఇందుకూరుపేట వెలుగు కార్యాలయం ఆవరణలో ఎంపీపీ కుంజం మురళీ అధ్యక్షతన సమావేశం జరుగుతుందన్నారు. మండలస్థాయి అధికారులు పూర్తి సమాచారంతో హాజరు కావాలని తెలిపారు.

నేడు గ్రామ వలంటీర్లకు సన్మానం

చింతూరు: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గురువారం గ్రామ వలంటీర్లకు సన్మాన కార్యక్రమం నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి హాజరు కానున్నారు. అనంతరం ఎమ్మెల్యే చేతుల మీదుగా ట్రాక్టర్ల పంపిణీ కార్యక్రమం జరుగుతుందన్నారు.

ఏపీఈపీడీసీఎల్ ఏఈగా ప్రభాకర్



చింతపల్లిరూరల్: చింతపల్లి ఏపీఈపీడీసీఎల్ ఏఈగా వనుము ప్రభాకర్ గురువారం బాధ్యతలు చేపట్టారు. ఈయన పాడేరులో ఏఈగా చేస్తూ బదిలీపై చింతపల్లి ఏఈగా నియమితులయ్యారు. ఇక్కడ ఏఈగా పనిచేస్తున్న ఎం.వి.రమణ జి.మాడుగులకు బదిలీ అయ్యారు.

ఏఎంసీ చైర్‌పర్సన్‌కు పరామర్శ

కొయ్యూరు: రోడ్డు ప్రమాదంలో గాయపడిన చింతపల్లి మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ రాజులమ్మను గురువారం మండల ఉపాధ్యక్షుడు అప్పన వెంకటరమణ, మండల సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు రేగటి ముసిలినాయుడు, ఎస్టీ సెల్ మండల అధ్యక్షుడు రీముల గంగాధర్ పరామర్శించారు. ఆరోగ్యాన్ని జాగ్రత్తగా చూసుకోవాలని, కొద్ది రోజులు విశ్రాంతి తీసుకోవాలన్నారు సూచించారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.

విద్యార్థులకు యోగా పోటీలు



పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

దుంబ్రిగుడ: మండల కేంద్రంలోని శాఖ గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరాల్లో భాగంగా గురువారం విద్యార్థులకు యోగా పోటీలు నిర్వహించారు. శాఖ గ్రంథాలయాధికారి సునీత మాట్లాడుతూ త్వరలో వేసవి శిబిరాలు ముగియనున్నట్టు చెప్పారు. ఈనెల 11వ తేదీ వరకు శిబిరాలు జరుగుతాయన్నారు. వేసవి శిబిరాల్లో నిర్వహించిన వివిధ పోటీల్లో విజేతలకు త్వరలో బహుమతులు అందజేస్తామన్నారు.

వడదెబ్బకు జాగ్రత్తలు తీసుకోవాలి



ఉపాధి వేతనదారులతో మాట్లాడుతున్న జెడ్పీటీసీ సభ్యుడు నూకరాజు

కొయ్యూరు: ఉపాధి కూలీలు వడదెబ్బకు గురికాకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని జెడ్పీటీసీ సభ్యుడు వారా నూకరాజు సూచించారు. కొయ్యూరు పంచాయతీ చింతవానిపాలెంలో జరుగుతున్న ఉపాధి హామీ పథకం పనులను ఆయన గురువారం పరిశీలించారు. ఉపాధి కూలీలతో మాట్లాడారు. ఎండలు తీవ్రంగా ఉండడంతో జాగ్రత్తలు తీసుకోవాలని, తాగునీరు ఉంచుకోవాలని సూచించారు. పనికి తగ్గ వేతనాలు సకాలంలో ఖాతాల్లో జమ అవుతుందన్నారు. ఉపాధి పనులను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఉపాధి హామీ పథకం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అయ్యవార్లు అడ్డదారులు..!

ఆనందపురం మండలం ఎంపీయూపీఎస్ వెంకటాపురంలో స్కూల్ అసిస్టెంట్ సోషల్ పోస్టును రేషనలైజేషన్‌లో చూపించారు. అక్కడ పనిచేసే ఉపాధ్యాయుడు బదిలీల్లో తప్పనిసరిగా మరోచోటకు దరఖాస్తు చేసుకోవాల్సి ఉంది. కానీ పోస్టు రేషనలైజేషన్‌కు గురికాలేదనే తప్పుడు సమాచారం నమోదు చేశారు. ఆ ఉపాధ్యాయుడికి తెలిసో, తెలియకో ఇలా చేసినా, పర్యవేక్షణాధికారిగా ఉన్న ఎంఈవో దీన్ని సరిదిద్దాలి. అధికారులు చేసిన తప్పిదాన్ని విద్యాశాఖ ఉన్నతాధికారులు గుర్తించి, ఎందుకిలా జరిగిందో సంజాయిషీ ఇవ్వాలని సదరు ఎంఈవోకు మెమో జారీ చేశారు.

సబ్బవరం మండల కేంద్రంలోని హైస్కూల్‌లోని ఓ ఉపాధ్యాయురాలు ఎనిమిదేళ్ల సరీస్ను నిండకున్నా, దరఖాస్తులో మాత్రం 'ఎస్' గుర్తించటంతో అక్కడి పోస్టు ఖాళీగా ఉన్నట్లు జాబితాలోకి చేరింది. దీంతో అనివార్యంగా సదరు ఉపాధ్యాయురాలు గాల్లో ఉండాల్సిన పరిస్థితి తలెత్తింది. ఎంఈవో సరైన పరిశీలన చేయకపోవటంతోనే ఈ సమస్యకు కారణంగా గుర్తించిన ఉన్నతాధికారులు మెమో జారీ చేశారు.



చోడవరం బాలికల ఉన్నత పాఠశాలలో హెచ్‌ఎంగా విధుల్లో చేరిన రామిరెడ్డి

- బదిలీల్లో ఇష్టారాజ్యం
- 106 మందికి మెమోలు జారీ
- జాబితాల పరిశీలనలో అధికారుల అలసత్వం
- డీఈవో కార్యాలయంలో ఓ యూనియన్ గుత్తాధిపత్యం
- ఖాళీలు చూపించడంలో అధికారుల నిర్లక్ష్యం
- ఫిజికల్ డైరెక్టర్లకు తీవ్ర నష్టం

విశాఖ విద్య : ఉమ్మడి విశాఖ జిల్లాలో ఇలా 106 మంది ఉపాధ్యాయులు వెబ్‌సైట్‌లో పొందుపరిచిన బదిలీ దరఖాస్తులో దొర్లిన తప్పిదాలను ఉన్నతాధికారులు గుర్తించారు. పూర్తి స్థాయిలో అవగాహన లేకనే చాలా మంది ఉపాధ్యాయులు ఇలా చేశారని చెబుతున్నా, పర్యవేక్షణాధికారులుగా ఉన్న ప్రధానోపాధ్యాయులు, ఎంఈవో, డిప్యూటీ డీఈవోలు తగిన రీతిలో పరిశీలన చేయలేదనేది దీని ద్వారా తేటతెల్లమైంది. జరిగిన తప్పిదంతో ఎనిమిదేళ్ల సరీస్ను పూర్తి కాకున్నా, ఆ చోటు వెబ్‌సైట్‌లో ఖాళీల జాబితాల్లో కనిపించటం వల్ల వేరే ఉపాధ్యాయులు కోరుకున్నారు. ఫలితంగా ఒకే చోట ఇద్దరేసి ఉపాధ్యాయులు ఉండాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయి. నగరంలోని రైల్వే కాలనీ స్కూల్లో ఇద్దరు ఉపాధ్యాయుల మధ్య తలెత్తిన ఇటువంటి వివాదం విద్యాశాఖాధికారుల మెడకు చుట్టుకునేలా కనిపిస్తోంది. దీన్ని సరిదిద్దేందుకు విద్యాశాఖాధికారులు రంగంలోకి దిగారు. ఉమ్మడి విశాఖ జిల్లాలో 106 మంది ఉపాధ్యాయులు, వారి పర్యవేక్షణాధికారులకు మెమోలు జారీ కావటం ఇప్పుడు హాట్ టాపిక్‌గా మారింది.

వారి నిర్లక్ష్యం.. పీడీలకు శాపం

ఉమ్మడి జిల్లా ప్రాతిపదికన నిర్వహిస్తున్న బదిలీల ప్రక్రియకు విశాఖపట్నం డీఈవో నోడల్ అధికారిగా వ్యవహరిస్తున్నారు. బదిలీలు పారదర్శకంగా నిర్వహించేందుకు ఆమె ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నా... కార్యాలయంలోని ఓ అధికారి నిర్వాకం, సిబ్బంది అలసత్వం కారణంగా ఫిజికల్ డైరెక్టర్‌లకు తీవ్ర అన్యాయం జరిగిందని ఉపాధ్యాయులు అంటున్నారు. విశాఖ జిల్లాలో 54 వరకు పీడీ పోస్టులు ఉండగా, 21 మాత్రమే ఖాళీలను వెబ్‌సైట్‌లో ఉంచటం వల్ల, అనివార్యంగా అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు జిల్లాలకు బదిలీపై వెళ్లాల్సి వస్తోందని పలువురు ఫిజికల్ డైరెక్టర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా పనిచేసే ఓ ఉపాధ్యాయ సంఘం నాయకులు డీఈవో కార్యాలయంలోనే తిష్ట వేసి, గుత్తాధిపత్యం చేస్తుండంతోనే తప్పిదాలు చోటుచేసుకుంటున్నాయని ఉపాధ్యాయులు బాహాటంగానే అంటున్నారు. దీనిపై ఫిర్యాదు చేసేందుకు మిగతా ఉపాధ్యాయ సంఘాలు సిద్ధమౌతున్నట్లు తెలుస్తోంది.

బదిలీ ఉత్తర్వులు విడుదల

ఉపాధ్యాయుల బదిలీల ప్రక్రియ చివరి అంకానికి చేరుకుంది. 146 మంది గ్రేడ్-2 హెచ్‌ఎంల బదిలీల ఉత్తర్వులు బుధవారం సాయంత్రం విడుదల కాగా, వీరంతా గురువారం రిలీవ్ అయి, బదిలీ అయిన స్కూళ్లలో విధుల్లో చేరారు. స్కూల్ అసిస్టెంట్‌లకు శుక్రవారం సాయంత్రానికి పూర్తి స్థాయిలో ఉత్తర్వులు జారీ కానున్నాయి. దీంతో ఉపాధ్యాయుల్లో సందడి వాతావరణం నెలకొంది.

అందరికీ ఆమోదకరమైన రీతిలో బదిలీలు



ఉపాధ్యాయులందరికీ ఆమోదకరమైన రీతిలో బదిలీలు జరుగుతున్నాయి. ఏదైనా తప్పిదాలు జరిగితే, పర్యవేక్షణాధికారుల నుంచి వివరణ కోరి, తదుపరి చర్యలు తీసుకుంటాం. ఆప్షన్స్ నమోదులో తలెత్తిన సాంకేతిక సమస్యలపై ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. బదిలీలు పారదర్శకంగా నిర్వహిస్తున్నాం.

– ఎం.జ్యోతికుమారి, బదిలీల ప్రత్యేకాధికారి, ఉమ్మడి విశాఖ జిల్లా

సమావేశంలో వెల్లువెత్తిన సమస్యలు



మాట్లాడుతున్న ఎంపీపీ పాయం రంగమ్మ

కూనవరం: మండలంలో తాగునీటి సమస్యను తక్షణమే పరిష్కరించాలని, జల్‌జీవన్ మిషన్ ద్వారా చేపట్టిన పనుల పురోగతిపై సంబంధిత అధికారులు స్పష్టత ఇవ్వాలని పలువురు సభ్యులు కోరారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గురువారం ఎంపీపీ పాయం రంగమ్మ అధ్యక్షతన సర్వసభ్య సమావేశంలో సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పలు సమస్యలు లేవనెత్తారు. పలువురు రైతులకు వ్యవసాయ పరికరాల పంపిణీలో జాప్యం సమస్యను పలువురు సభ్యులు తెలియజేశారు. రెండవ విడత నాడు–నేడు పనుల వివరాలను తెలియజేయాలని సభ్యులు కోరగా, ఎంఈవో నీలి బాలరాజు వాటిపై వివరణ ఇచ్చారు. గోదావరి వరదలకు సంబంధించి ముందస్తుగా మండలస్థాయి సమావేశం నిర్వహించాలని కోరారు. పంచాయతీల పరిధిలో విద్యుత్ లైట్లు నిరంతరాయంగా వెలుగుతున్నాయని, పరిష్కరించాలని కోరారు. జెడ్పీటీసీ సభ్యురాలు గుజ్జా విజయ, ఎంపీడీవో శ్రీనివాసరావు, తహసీల్దార్ కె.అనసూయ, వైస్ ఎంపీపీలు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఐదు ఇసుక ట్రాక్టర్లు సీజ్



చింతూరులో సీజ్ చేసిన ఇసుక ట్రాక్టర్లు

చింతూరు: మండలంలోని కుయిగూరులో శబరినది నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న ఐదు ట్రాక్టర్లను ఐటీడీఏ పీవో, సబ్ కలెక్టర్ సూరజ్ ధనుంజయ్ గనోరే ఆదేశాల మేరకు గురువారం సీజ్ చేసినట్టు తహసీల్దార్ కారం సుబ్బారావు తెలిపారు. సీజ్ చేసిన ట్రాక్టర్లను భద్రత నిమిత్తం పోలీసుస్టేషన్‌కు తరలించినట్టు పేర్కొన్నారు. ఐటీడీఏ పీవో, సబ్ కలెక్టర్ అనుమతి లేకుండా అక్రమంగా ఇసుక రవాణాకు పాల్పడితే తగిన చర్యలు తీసుకుంటామని, లైసెన్స్ రద్దు చేయడంతో పాటు వాహనాలను సీజ్ చేస్తామని తహసీల్దార్ సుబ్బారావు హెచ్చరించారు.

తాగునీటి సమస్య పరిష్కరించరూ..



పాడైన బోరు

అడ్డతీగల: మండల కేంద్రంలోని టెలిఫోన్ ఎక్స్ఛేంజ్ వీధిలో కుళాయి పాడవడంతో తాగునీటి నెలకొందని స్థానికులు చెబుతున్నారు. మూడు నెలల నుంచి సమస్య ఉందని చెబుతున్నారు. దీంతోపాటు వీధిలో చేతిపంపు కూడా పాడైందంటున్నారు. సమస్యను పంచాయతీ అధికారులకు, గ్రామ వలంటీర్‌కు విన్నవించినా పరిష్కారానికి నోచుకోలేదంటున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలని వారు కోరుతున్నారు. ఈ విషయంపై ఎంపీడీవో కె.బాపన్నదొరను వివరణ కోరగా గ్రామ పంచాయతీ అధికారుల ద్వారా వివరాలు తీసుకొని యుద్ధ ప్రాతిపదికన మరమ్మతు పనులు చేయించి మంచినీటి సరఫరా జరిగేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు.

హుకుంపేట: మండలంలోని ఓల్డా పంచాయతీ పోసలగరువులో తాగునీటి సమస్య వెంటాడుతోందని స్థానికులు చెబుతున్నారు. గ్రామంలోని బోరులో నీరు అడుగంటడంతో తాగునీటికి ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్రామంలో ఇటీవల సోలార్‌బోరు, హ్యాండ్‌బోరు ఏర్పాటుచేసినప్పటికీ ఎండతీవ్రత వల్ల కొంతవరకు నీరు వచ్చి ఆగిపోతుందని చెబుతున్నారు. అధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలని కోరుతున్నారు. ఈ విషయంపై ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈఈ ఎం.రమేష్‌బాబు మాట్లాడుతూ గతంలో బోరు వేశామని, వేసవిలో నీరు అడుగంటడంతో సమస్య తలెత్తిందన్నారు. అయితే కొద్ది రోజుల్లో గ్రామంలో మరో బోరు ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామన్నారు.

ఘనజీవామృతంతో పంటలకు జీవం

కశింకోట : ఘనజీవామృతం పంటలకు అమృతంలా పని చేస్తుందని మండల మహిళా సమాఖ్య అధ్యక్షురాలు కూండ్రపు అరుణ అన్నారు. మండలంలోని జి.భీమవరం, లాలంకొత్తూరు, సుందరయ్యపేట తదితర గ్రామాల్లో ఘనజీవామృతం దినోత్సవాన్ని స్వయం సహాయక సంఘాలు, రైతులు, ప్రకృతి వ్యవసాయ సాగు రైతులు, సిబ్బంది గురువారం సంయుక్తంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తయారీపై అవగాహన కల్పించారు. అనంతరం అరుణ మాట్లాడుతూ నేలలు, పంటలు, పర్యావరణం, మన ఆరోగ్యం సమతుల్యంగా ఉండడానికి ఘనజీవామృతం ఉపకరిస్తుందన్నారు. దేశీయ ఆవు పేడ, గోమూత్రం, బెల్లం, పుట్టమన్ను తదితర వాటిని కలిపి జీవామృతం తయారు చేస్తారని వివరించారు. వీటిని ఏడురోజులపాటు ఎండబెట్టి నిల్వ ఉంచి, ఎకరాకు 100 కిలోల వంతున దుక్కిలో వేయాలని సూచించారు. పంటసాగు చేసిన నెల రోజులకు మరోసారి జీవామృతం వేస్తే, ఆరోగ్యకరమైన పంటలు ఉత్పత్తి అవుతాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది ద్వారపురెడ్డి రమణ, ద్వారపురెడ్డి వెంకటలక్ష్మి, కాయల దేవి పాల్గొన్నారు.

రోడ్డు పనులకు ప్రతిపాదనలు



మడతకొండలో మట్టి రోడ్డు పనులు పరిశీలిస్తున్న ఎంపీడీవో చంద్రశేఖర్‌రావు

జి.మాడుగుల: మండలంలో బొయితిలి పంచాయతీ మడతకొండ మారుమూల గ్రామంలో చేపట్టిన మట్టిరోడ్డు నిర్మాణ పనులు గురువారం ఎంపీడీవో చంద్రశేఖరరావు పరిశీలించారు. ఈ రోడ్డు నిర్మాణానికి కలెక్టర్ సుమిత్‌కుమార్ రూ. 2 లక్షలు నిధులు విడుదల చేశారు. ఆయా నిధులతో పనులు చేపట్టారు. ఈ రోడ్డులో ఇంకా కొన్ని కొండలు అడ్డంగా ఉన్నాయని, ఈ కొండలు తొలగించి రోడ్డు వెడల్పు చేస్తే జీపులు, ఆటోలు వంటి వాహనాలు రాకపోకలు సాగించటానికి ఉంటుందని తమ పరిశీలనలో తేలిందన్నారు. జిల్లా కలెక్టర్‌కు నివేదిక అందజేస్తామని చెప్పారు. ప్రభుత్వం నిధులు మంజూరు చేసిన వెంటనే రోడ్డు అభివృద్ధి పనులు చేపట్టేందుకు అవకాశముంటుందన్నారు. మడతకొండ రోడ్డు అభివృద్ధి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపుతున్నట్టు ఆయన చెప్పారు. మండల ఇంజినీరింగ్ అధికారి ఎస్.మాణిక్యం, సర్పంచ్ మాలన్న, ఉపాధి హామీ పథకం సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా మరిడిమాంబ విగ్రహ ప్రతిష్ట

బుచ్చెయ్యపేట: పెదపూడి శివారు ఫంగిడి గ్రామంలో నూతనంగా నిర్మించిన మరిడిమాంబ ఆలయ ప్రారంభం, విగ్రహ ప్రతిష్ట కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఇటీవల గ్రామస్తులు గ్రామ శివారులో అమ్మవారి ఆలయం నిర్మించారు. ఈ సందర్భంగా వేదమంత్రాలు, ప్రత్యేక పూజలు, హోమాలు నిర్వహించారు. మధ్యాహ్నం ఆలయం వద్ద అన్న సమారాధన ఏర్పాటు చేశారు. సాయంత్రం ఏర్పాటు చేసిన చిడతల భజనలు, తప్పెటగుళ్లు, భక్తి పాటలు విశేషంగా భక్తులను అలరించాయి.

మాడుగుల రూరల్: కె.జె.పురం పాలగెడ్డ వద్ద మరిడిమాంబ ఆలయంలో గురువారం భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. మొక్కులు చెల్లించుకున్నారు. భజన కార్యక్రమం ఏర్పాటు చేశారు.

మహిళా సంక్షేమానికి ప్రత్యేక చర్యలు

హుకుంపేట: మహిళ సంక్షేమానికి కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టిందని బీజేపీ మహిళా మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లక్ష్మి ప్రసన్న తెలిపారు. మండలంలోని సంతారి పంచాయతీ కేంద్రంలో ఆమె గురువారం పర్యటించారు. ఈ నేపథ్యంలో పార్టీ జిల్లా మహిళా మోర్చా అధ్యక్షురాలు తాంగుల సత్యవతి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె పాల్గొన్నారు. కేంద్ర ప్రభుత్వం జల్‌జీవన్ మిషన్ ద్వారా ఇంటింటికీ కుళాయిలు ఏర్పాటుచేస్తోందన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో అందిస్తున్న పౌష్టికాహారాన్ని గర్భిణు లు, బాలింతలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. మఠం సర్పంచ్ శాంతకుమారి, ఉత్తరాంధ్రా మహిళ మోర్చా జోనల్ ఇన్‌చార్జి రోహిణి, జిల్లా అధ్యక్షుడు పాంగి రాజారావు, జిల్లా ఉపాధ్యక్షురాలు శ్రీలక్ష్మి, నాయకులు పాల్గొన్నారు.

కనులపండువగా శ్రీనివాసుని కల్యాణం



పూజల్లో పాల్గొన్న భక్తులు

వై.రామవరం: మండల సరిహద్దు ప్రాంతమైన వెదురునగరం గ్రామంలోని సాయిరాం ఆశ్రమ దేవాలయాల ప్రాంగణంలో గురువారం పాశుపతి హోమం, శ్రీనివాస కల్యాణం, రుద్రాభిషేకం తదితర దైవ కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. ఆశ్రమ నిర్వాహకులు సాయిరాం గురుస్వామి ఆధ్వర్యంలో ఆలయ ప్రాంగణంలో వినాయకుడు వెంకటేశ్వరస్వామి, కాలభైరవుడు, ఆంజనేయస్వామి, సాయిబాబ, శివుడు, కాళికామాత, వరాహీమాత, తదితర దేవాలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రవణ నక్షత్రం పురస్కరించుకొని లోక కల్యాణం కోసం వేదపండితుల సహాయ సహకారాలతో హోమం, అభిషేకం, శ్రీనివాస కల్యాణం నిర్వహించినట్టు ఆయన చెప్పారు. మధ్యాహ్నం భారీ అన్నసమారాధన జరిగింది. అడ్డతీగల మండలం వేటమామిడి గ్రామానికి చెందిన రేణుకాలమ్మ మహంకాళీ అమ్మవారి దేవాలయ గిరిజన ప్రధాన అర్చకులు ముర్ల రాజారెడ్డి తదితరులు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. స్థానికులతో పాటు సమీప ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చినట్టు నిర్వాహకులు తెలిపారు.

వాలీబాల్ కిట్‌లు పంపిణీ



వాలీబాల్ కిట్‌ను అందజేస్తున్న శివప్రసాద్

కొయ్యూరు: క్రీడల ద్వారా శరీర ధారుడ్యం పెరిగి ఆరోగ్యంగా ఉంటామని నేను సైతం చారిటబుల్ వ్యవస్థాపకులు కె.శివప్రసాద్ అన్నారు. డౌనూరులో గురువారం జరిగిన కార్యక్రమంలో ఆయన స్థానిక క్రీడాకారులకు వాలీబాల్ కిట్లను అందజేశారు. ఆయన మాట్లాడుతూ క్రీడలు మానసిక ఉల్లాసాన్ని కలిగిస్తాయన్నారు. మన్యంలో ఎక్కువ మంది వాలీబాల్ ఆడేందుకు ఇష్టపడుతున్నారని, ఈ మేరకు యువతకు వాలీబాల్ కిట్లు అందజేస్తున్నట్టు చెప్పారు. తమ సంస్థ తరఫున పలుచోట్ల వాలీబాల్ పోటీలు నిర్వహిస్తున్నామని, క్రీడాకారులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.సురేష్ పట్నాయక్ తదితరులు పాల్గొన్నారు.

సీఎం వైఎస్ జగన్‌కు రుణపడి ఉంటాం



వై.రామవరంలో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న కాంట్రాక్టు లెక్చరర్లు

పాడేరు రూరల్ : కాంట్రాక్ట్ ఉద్యోగుల క్రమబద్ధీకరణపై కేబినెట్‌లో తీసుకున్న నిర్ణయంతో తమ ఆనందానికి అవధులు లేవని, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి జీవితాంతం రుణపడి ఉంటామని కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఫెడరేషన్ జిల్లా అధ్యక్షుడు శెట్టి నాగరాజు గురువారం ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. గిరిజన ప్రాంతంలో 2001 నుంచి 2014 వరకు జరిగిన కాంట్రాక్ట్ ఉద్యోగాల నియమకాల్లో అప్పటి ప్రభుత్వాలు తక్కువ మందిని మాత్రమే నియమించిందని, 2017 నుంచి ఎక్కువగా నియామకాలు చేపట్టారన్నారు. గిరిజన ప్రాంతంలో ఐదేళ్ల సర్వీస్ పూర్తి చేసిన కాంట్రాక్ట్ ఉద్యోగులందరిని రెగ్యులర్ చేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఏళ్ల తరబడి రెగ్యులర్‌ను నోచుకోని ఉద్యోగులు సీఎం వైఎస్ జగన్ తీసుకున్న నిర్ణయంతో రెగ్యులర్ ఉద్యోగులుగా మారుతుండటంతో వారి కుటుంబాల్లో పండుగ వాతావరణం నెలకొందని పేర్కొన్నారు. సీఎం వైఎస్ జగన్‌కు కాంట్రాక్ట్ ఉద్యోగుల తరఫున ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుతున్నామని చెప్పారు.

సీఎం జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం

వై.రామవరం: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల కాంట్రాక్టు లెక్చరర్లు గురువారం ఆ కళాశాల ఆవరణలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. కాంట్రాక్ట లెక్చరర్ గొర్ల మాణిక్యం ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో పల్లేటి చంద్రశేఖర్, కొప్పిసెట్టి దొరబాబు, కంటు శివయ్య తదితరులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత ఎన్నికల మ్యానిఫెస్టోలో ఇచ్చిన హామీ మేరకు వేలాది మంది కాంట్రాక్టు ఉద్యోగులను క్రమబద్ధీకరిస్తు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అధ్యక్షతన నిర్వహించిన క్యాబినేట్ సమావే శంలో ఆమోదించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. ఎన్నో ఏళ్లుగా ఏ ప్రభుత్వం తమను పట్టించుకోలేదని, మాయమాటలు చెప్పి మోసగించాయన్నారు. అయితే జగనన్న ఇచ్చిన హామీను నిలబెట్టుకుని, తమకు న్యాయం చేశారన్నారు. ఈ సందర్భంగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి వారు కృతజ్ఞతలు తెలిపారు.

విభిన్న ప్రతిభావంతుల వసతి గృహాల్లో ప్రవేశాలకు దరఖాస్తులు

పాడేరు రూరల్ : ఉమ్మడి విశాఖపట్నం జిల్లాలో చదువుకుంటున్న దివ్యాంగ బాలుర కోసం విభిన్న ప్రతిభావంతులు, హిజ్రాలు, వయోవృద్ధులకు సంక్షేమ శాఖ కల్పిస్తున్న సౌకర్యాలను సద్వినియోగం చేసుకోవాలని స్పెషల్ డిప్యూటీ కలెక్టర్, విభిన్న ప్రతిభావంతులు, హిజ్రాలు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ సహాయ సంచాలకులు జె.మాధవి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పెదవాల్తేరు, పెందుర్తి వసతి గృహాల్లో 4వ తరగతి నుంచి డిగ్రీ అభ్యసించేందుకు దివ్యాంగ బాలుర ప్రవేశాల కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు పేర్కొన్నారు. ఆసక్తి గల వారు 40 శాతం అంగ వైకల్యం తెలిపే సదరం సర్టిఫికెట్, ఆధార్ కార్డు, రేషన్ కార్డు, రెండు పాస్ పోర్ట్‌సైజ్ ఫోటోలతో దరఖాస్తు చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాల కోసం 9948497333 నంబర్‌కు సంప్రదించాలన్నారు. టెన్త్ పాసైన దివ్యాంగ విద్యార్థులకు మధురవాడ, బక్కన్నపాలెం వద్ద గల ప్రభుత్వ ఐటీఐలో ఉచిత శిక్షణ ఇస్తామని ఆమె పేర్కొన్నారు. మరిన్ని వివరాల కోసం 7396424319 నంబర్‌కు సంప్రదించాలన్నారు. ఎండాడలో ఉన్న ప్రభుత్వ అంధ బాలికల ఆశ్రమ పాఠశాలలో ఒకటో తరగతి నుంచి టెన్త్ వరకు అంధ బాలికలకు బ్రెయిన్ లిపి ద్వారా ఉచితంగా ప్రత్యేక విద్యను అందిస్తున్నామని ప్రవేశాల కోసం దరఖాస్తులు స్వీకరిస్తున్నట్టు చెప్పారు. మరిన్ని వివరాల కోసం 9494914950 నంబర్‌కు సంప్రదించాలని సూచించారు.

వైభవంగా అమ్మవార్ల ఉత్సవాలు



కొత్తమహాలక్ష్మి అమ్మవారి ఊరేగింపు

దేవరాపల్లి: ఎన్.గజపతినగరంలో మరిడిమాంబ అమ్మవారి పండగను గురువారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఆరేళ్ల తర్వాత నిర్వహించిన ఈ పండగకు పెద్ద ఎత్తున భక్తులు తరలి వచ్చారు. ఈ సందర్భంగా తెల్లవారుజాము నుంచి గ్రామస్తులు అమ్మవారికి భక్తిశ్రద్ధలతో పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. మరిడిమాంబ అమ్మవారిని డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు దర్శించుకుని భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు. ఆయనకు ఆలయ కమిటీ సభ్యులు సత్కరించి తీర్థ ప్రసాదాలను అందజేశారు. సర్పంచ్ చిరికి లక్ష్మి, చిరికి నారాయణరావు, రొంగలి సింహాచలంనాయుడు, సచివాలయ కన్వీనర్ చిరికి జగ్గనాయుడు తదితర గ్రామ పెద్దలు పాల్గొన్నారు. అదేరోజు రాత్రికి పలు సాంస్కృతిక, ఆధ్యాత్మిక కార్యక్రమాలను నిర్వహించారు.

ఘనంగా కొత్తమహాలక్ష్మి అమ్మవారి పండగ

మునగపాక: మునగపాకలో గురువారం కొత్త మహాలక్ష్మి అమ్మవారి పండగ ఘనంగా జరిగింది. ఉదయం నుంచి అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు తరలివచ్చారు. డప్పు వాయిద్యాల నడుమ అమ్మవారి ఊరేగింపు చేపట్టారు. ఈ సందర్భంగా భక్తులు అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్నారు. అమ్మవారి దర్శనం కోసం వచ్చే భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా నిర్వాహకులు తగు చర్యలు తీసుకున్నారు.